నమస్తే తెలంగాణ
భద్రాద్రి కొత్తగూడెం
5 | ఖమ్మం, శుక్రవారం 14 జూన్ 2024 | BHADRADRI KOTHAGUDEM

పరిహారం ఇస్తారా? లేదా?

- మంత్రులను అడ్డుకున్న 'సీతారామ' నిర్వాసితులు
- పోడు భూముల గిరిజనులతో కలిసి రాస్తారోకో
- పరిహారం, పోడు పట్టాలు ఇవ్వాలని డిమాండ్
- వినతిపత్రం స్వీకరించిన మంత్రి పొంగులేటి

గిరిజనులను అడ్డుకుంటున్న పోలీసులు


పట్టాలు చూపిస్తున్న గిరిజనులు

అశ్వారావుపేట/ములకలపల్లి, జూన్ 13 : 'సీతారామ ప్రాజెక్టు కాలువల నిర్మాణాల్లో సాగు భూములు కోల్పోయిన తమకు పరిహారం ఇస్తారా? లేదా?' అంటూ నిర్వాసితులు ప్రశ్నించారు. ఈ మేరకు ప్రాజెక్టు పనుల పరిశీలన కోసం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ములకలపల్లి మండలానికి గురువారం వచ్చిన మంత్రులను నిలదీసేందుకు సిద్ధమయ్యారు. అదే సమయంలో పోడు గిరిజనులతో కలిసి రోడ్డుపై రాస్తారోకో నిర్వహించారు. సమాచారం తెలుసుకున్న మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి నిర్వాసితుల నుంచి వినతిపత్రం స్వీకరించారు. సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. దీంతో ఆందోళన సద్దుమణిగింది. వివరాల్లోకి వెళితే.. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ములకలపల్లి మండలం ఒడ్డురామవరం గ్రామ సమీపంలో నిర్మిస్తున్న సీతారామ ప్రాజెక్టు పంపుహౌస్ పనులను పరిశీలించేందుకు డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, రాష్ట్ర వ్యవసాయ, రెవెన్యూ, నీటిపారుదల శాఖల మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఉత్తమ్‌కుమార్‌రెడ్డిలు ఖమ్మం, మహబూబాబాద్ ఎంపీలు రామసహాయం రఘురాంరెడ్డి, పోరిక బలరాంనాయక్, ఉమ్మడి ఖమ్మం జిల్లా ఎమ్మెల్యేలతో కలిసి వెళ్లారు. అయితే ప్రాజెక్టు కాలువ, పంపుహౌస్ నిర్మాణాల్లో భూములు కోల్పోయిన ఆ గ్రామానికి చెందిన నిర్వాసితులు పద్దం రాజులు, బానోతు కాసనా, బానోతు మంగ్య, గుగులోతు సోమ్లా, వెంకన్న, లావుడ్యా ఇల్లమ్మ, పద్దం కృష్ణమ్మ, కారం కౌసల్య తదితరులు మంత్రులు వచ్చిన విషయం తెలుసుకున్నారు. వెంటనే అక్కడికి చేరుకొని మంత్రులను అడ్డుకోబోయారు. వెంటనే వారిని పోలీసులు పక్కకు నెట్టివేశారు. అదే సమయంలో అక్కడకు చేరుకున్న పోడు భూముల గిరిజనులతో కలిసి రోడ్డుపై రాస్తారోకో చేశారు. ప్రాజెక్టు కాలువల కోసం తీసుకున్న తమ భూములకు పరిహారం ఇవ్వాలని, పాతికేళ్లుగా సాగు చేసుకుంటున్న పోడు భూములకు పట్టాలు మంజూరు చేయాలని ధరావత్ సోమ్లా, శంకర్, బానోతు సోమ్లా, రాంబాబు, ధరావత్ వీరన్న, తదితరులు మంత్రులను డిమాండ్ చేశారు. దీంతో ఆందోళనకారులను మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పిలిపించుకొని వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రాజెక్టు కాలువల నిర్మాణంలో సాగు భూములు కోల్పోయిన తమకు పరిహారం అందలేదని వివరించారు. పోడు చేసుకుంటున్న తమను అటవీ అధికారులు కేసులతో వేధిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కోర్టుల చుట్టూ తిరగలేక అవస్థలు పడుతున్నట్లు వివరించారు. తక్షణమే పరిహారం మంజూరు చేయాలని, పోడు భూములకు హక్కు పత్రాలు అందించాలని, కేసులు ఎత్తివేయాలని విజ్ఞప్తి చేశారు. అందుకు మంత్రి పొంగులేటి స్పందించారు. లిఖిత పూర్వకంగా వినతిపత్రం ఇస్తే సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని అన్నారు. దీంతో ఆందోళన విరమించిన నిర్వాసితులు, పోడు గిరిజనులు మంత్రి పొంగులేటికి వినతిపత్రం అందించారు. పోడు గిరిజనులు జర్పుల నారాయణ, ధరావత్ యాకూబ్, కోర్సా ఆదినారాయణ, గుగులోతు భోజ్యా, భద్రు, లావూడ్యా బుజ్జి, బానోతు మల్లేష్, రామచంద్రు, బానోతు నవుశ్య తదితరులు పాల్గొన్నారు.

1.20 లక్షల ఎకరాలకు సాగునీరిస్తాం

త్వరలో 'సీతారామ' 1, 2, 3 ప్యాకేజీల పనులు పూర్తి చేస్తాం

ఏన్కూరు లింక్ కాలువకు రాజీవ్ కెనాల్‌గా పేరు మార్చాం

'సీతారామ' సమీక్షలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క

పాల్గొన్న మంత్రులు ఉత్తమ్‌కుమార్, పొంగులేటి, తుమ్మల

సమీక్షలో మాట్లాడుతున్న ఉప ముఖ్యమంత్రి భట్టివిక్రమార్క, మంత్రులు తుమ్మల, పొంగులేటి, ఉత్తమ్, ఎమ్మెల్యేలు

ఖమ్మం, జూన్ 13 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): ఆగస్టు 15 నాటికి ఏన్కూరు లింక్ కెనాల్‌ను పూర్తి చేసి 1.20 లక్షల ఎకరాలకు గోదావరి నుంచి సాగునీటిని అందిస్తామని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. సీతారామ ఎత్తిపోతల పథకంలో 1, 2, 3 ప్యాకేజీల పనులను త్వరలోనే పూర్తి చేస్తామని అన్నారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, సాగునీరు, వ్యవసాయ, రెవెన్యూ శాఖల మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి కలిసి భద్రాద్రి జిల్లాలో గురువారం పర్యటించారు. తొలుత అశ్వాపురం మండలం అమ్మగారిపల్లి వద్ద ఉన్న సీతారామ ప్రాజెక్టు హెడ్ రెగ్యులేటరీ పనులను పరిశీలించారు. తర్వాత ములకలపల్లి మండలం పూసుగూడెం వద్ద మూడో పంపుహౌజ్ పురోగతి గురించి అధికారులతో సమీక్షించారు. 'ఇప్పటి వరకు జరిగిన పనులు, కొనసాగుతున్న పనులు, భూ సేకరణ, ప్రాజెక్టు పూర్తి కావడానికి కావాల్సిన నిధులు, ఎదురవుతున్న సమస్యలు' వంటి అంశాల గురించి ఇరిగేషన్ ఇంజినీరింగ్ అధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా మంత్రులకు వివరించారు. అనంతరం డిప్యూటీ సీఎం విక్రమార్క మాట్లాడుతూ.. రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులను పూర్తి చేయడానికి సచివాలయంలో ఉన్నత స్థాయి సమీక్షలు చేశామన్నారు. ఈ ప్రాజెక్టు పూర్తి చేసే విషయం గురించి కూడా సమీక్షించామన్నారు. 9 కిలోమీటర్లు ఉన్న ఏన్కూరు లింక్ కెనాల్‌ను పూర్తి చేయడానికి రూ.72 కోట్లు మంజూరు చేశామన్నారు. పంపుల ట్రయల్ రన్‌కు పవర్ సప్లయి కోసం నిధులు ఇచ్చామన్నారు. ఏన్కూరు లింకు కాలువకు రాజీవ్ కెనాల్‌గా నామకరణం చేసినట్లు చెప్పారు. సీతారామ పంపుహౌస్‌ల 1, 2, 3 డిస్ట్రిబ్యూటరీ ప్యాకేజీ పనులు తొందరలోనే మొదలవుతాయని వెల్లడించారు.

రాజీవ్ కెనాల్‌గా ఏన్కూరు కాలువ: ఉత్తమ్

తక్కువ ఖర్చుతో తక్కువ సమయంలో ఎక్కువ మొత్తంలో సాగునీరు ఇవ్వడానికి ఇరిగేషన్ శాఖ ప్రణాళికను తయారు చేసుకొని ముందుకెళ్తోందని నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. సీతారామ ప్రాజెక్టులో అనుసంధానంగా ఉన్న ఏన్కూరు కాలువకు ఇప్పటికే నిధులు మంజూరు చేశామన్నారు. ఆ కాలువకు రాజీవ్ కెనాల్‌గా పేరు పెట్టినట్లు చెప్పారు. పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులన్నీ పూర్తి చేస్తామన్నారు. భద్రాచలం, కొత్తగూడెం నియోజకవర్గాలకు కూడా సాగునీరు అందేలా చర్యలు తీసుకుంటామన్నారు. మంత్రులు తుమ్మల, పొంగులేటి మాట్లాడుతూ.. 1998లోనే దుమ్ముగూడెం పేరుతో ఈ ప్రాజెక్టుకు రూపకల్పన జరిగినట్లు చెప్పారు. అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వ చొరవతోనే ఇప్పటి సీతారామ ప్రాజెక్టుకు పునాదులు పడ్డాయన్నారు. ఈ వర్షాకాలంలోనే రైతులకు ఉపయోగపడేలా సీతారామ ప్రాజెక్టు పనులు పూర్తి చేస్తామన్నారు. ఎంపీలు రఘురాంరెడ్డి, బలరాంనాయక్, ఎమ్మెల్యేలు కూనంనేని సాంబశివరావు, తెల్లం వెంకట్రావు, జారె ఆదినారాయణ, పాయం వెంకటేశ్వర్లు, మట్టా రాగమయి, కలెక్టర్ ప్రియాంక, అదనపు కలెక్టర్లు విద్యాచందన, వేణుగోపాల్, ఇరిగేషన్ శాఖ అధికారులు శ్రీనివాసరెడ్డి, వెంకటేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

స్కూల్ బస్సులు ఫిట్‌నెస్‌తో ఉండాలి : జిల్లా రవాణాధికారి

స్కూల్ బస్సు డ్రైవర్లకు అవగాహన కల్పిస్తున్న డీటీవో

చుంచుపల్లి, జూన్ 13: పాఠశాలల పునఃప్రారంభంతో బడి బస్సులు రోడ్లపై పరుగులు పెడుతున్నాయి. చాలా వరకు బస్సులు నిబంధనలకు విరుద్ధంగా తిరుగుతున్నాయని అందిన ఫిర్యాదులతో రవాణా శాఖ అధికారులు తనిఖీలు చేట్టారు. నిబంధనలను అతిక్రమించిన బస్సులపై కొరడా ఝుళిపించారు. బస్సుల కండీషన్, ఫస్ట్ ఎయిడ్ బాక్సులు, ఇన్సూరెన్స్, పర్మిట్, అటెండర్ లేని బస్సులపై కేసులు నమోదు చేశారు. జిల్లావ్యాప్తంగా స్కూల్ బస్సులపై కేసులు నమోదు చేసినట్లు జిల్లా రవాణాధికారి తోట కిషన్‌రావు చెప్పారు. జిల్లాలో మొత్తం 229 బడి బస్సులు ఉన్నాయి. వాటిలో గురువారం వరకు 136 మాత్రమే ఫిట్‌నెస్ అయినట్లు తెలిపారు. ఇంకా 93 బస్సులు ఫిట్‌నెస్‌కు రావాల్సి ఉందన్నారు. ఈ నేపథ్యంలో గురువారం అశ్వాపురంలో బస్సుల యజమానులకు, డ్రైవర్లకు ఫిట్‌నెస్‌పై అవగాహన కల్పించారు. ఫిట్‌నెస్ లేకుండా బస్సు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

మూడోసారీ.. అదే దారి..

- మళ్లీ వాయిదాకే పరిమితమైన ఖమ్మం డీసీసీబీ సమావేశం
- చైర్మన్ వర్సెస్ డైరెక్టర్లుగా విడిపోయిన 'సహకార' పాలకవర్గం
- కర్షకులకు కాలం నెత్తిమీదున్నా కనికరం లేకుండా కయ్యాలు
- ఖాతాదారుల కష్టాలు గాలికి వదిలేసి పంతాలు, సొంత అజెండాలు
- ఉద్యోగుల ఎదుట దూషణలు.. తలుపులు పగులగొట్టేలా కోపాలు

సమావేశాన్ని బహిష్కరించి బయటకు వస్తున్న డీసీసీబీ డైరెక్టర్లు

ఖమ్మం వ్యవసాయం, జూన్ 13 : ఖమ్మం డీసీసీబీ పాలకవర్గ సమావేశం గురువారం మరోసారీ వాయిదాకే పరిమితమైంది. బహిరంగ దూషణలతో మూడోసారి కూడా వాయిదా పడింది. రోజులు మారినా, నెలలు గడిచినా పాలకవర్గ సభ్యుల వైఖరిలో పిసరంతైనా మార్పు లేదు. కాలం నెత్తిమీదకొచ్చి కర్షకులు కష్టాల్లో ఉన్నా వారిపై కనీస కనికరం చూపడం లేదు. ఖాతాదారులు కొట్టుమిట్టాడుతున్నా పట్టింపులేదు. కయ్యాలకు కాలు దువ్వుకుతున్నారే తప్ప కర్షకులు, ఖాతాదారుల సమస్యలను పట్టించుకోవడం లేదు. అదును పోకముందే అన్నదాతకు ఆపన్నహస్తం అందిస్తామని, తమ సమస్యలేమైనా ఉంటే తరువాత చర్చించుకుంటామని అనుకున్న పాపానపోలేదు. అసలు వారి పంతాలు, సొంత అజెండాలు తప్ప హలధారుల సమస్యల గురించి చర్చించే ఓపిక, పరిష్కరించే తీరిక వారికి ఏమాత్రమూ లేనట్లుగా కన్పిస్తోంది.

ప్రధాన కార్యాలయంలోనే రచ్చ..

డీసీసీబీ పాలకవర్గ బాధ్యుల్లోని విభేదాలు ముదిరిపాకాన పడుతున్నాయి. ఏకంగా బ్యాంకు ప్రధాన కార్యాలయంలోనే, అందులోనూ సాక్షాత్తూ ఉద్యోగుల సమక్షంలోనే బహిరంగ దూషణలు, వాగ్వాదాలు చేసుకునే పరిస్థితి ఏర్పడింది. చివరికి విశ్రాంతి భవనం తలుపులు పగులగొట్టే స్థాయికి చేరింది. గడిచిన మూడు నెలలుగా ఖమ్మం డీసీసీబీ పాలకవర్గ సభ్యులు రెండు గ్రూపులుగా విడిపోయారు. ఖాళీగా ఉన్న డైరెక్టర్ల స్థానాలను భర్తీ చేయాలని, ఇన్‌చార్జి చైర్మన్ స్థానంలో పూర్తిస్థాయి చైర్మన్‌ను ఎన్నుకోవాలని మెజార్టీ డైరెక్టర్లు పట్టుబడుతున్నారు. అందులో భాగంగానే మార్చి 15న ఏర్పాటైన పాలకవర్గ సమావేశంలో సభ్యులు నాలుగు ప్రధాన డిమాండ్లను చైర్మన్ దృష్టికి తీసుకొచ్చారు. వారి అభ్యర్థన చైర్మన్ పరిగణనలోకి తీసుకోకపోవడంతో ఆ సమావేశం వాయిదాపడింది. ప్రస్తుత ఇన్‌చార్జి చైర్మన్ దొండపాటి వెంకటేశ్వరరావు అధ్యక్షతన ఈ నెల 6న రెండోసారి పాలకవర్గ సమావేశం ఏర్పాటైంది. ఈ సమావేశంలోనూ ఖాళీ స్థానాలకు ఎన్నికలతోపాటు బ్యాంకు ఉద్యోగుల బదిలీలు, ఉద్యోగుల బోనస్ వివరాలు తదితర అంశాలను అజెండాలో చేర్చాలని డీసీసీబీ డైరెక్టర్లు తుళ్లూరి బ్రహ్మయ్య, బొర్రా రాజశేఖర్, మేకల మల్లిబాబుయాదవ్, జనగం కోటేశ్వరరావు సహా మొత్తం 10 మంది డైరెక్టర్లు పట్టుబట్టారు. అక్కడ కూడా ఆ డైరెక్టర్లకు భంగపాటు ఎదురుకావడంతో ఆ సమావేశం కూడా వాయిదా పడింది.

తలుపులు పగులగొట్టి లోపలికి..

ఇన్నాళ్లూ సమావేశ మందిరానికే పరిమితమైన డీసీసీబీ డైరెక్టర్ల కోల్డ్‌వార్ ఇటీవల మొత్తానికే బయటపడింది. తాజాగా గురువారం ఉద్యోగులు, అధికారుల సాక్షిగా రచ్చకెక్కింది. మూడోసారిగా గురువారం జరిగిన పాలకవర్గ సమావేశానికి తుళ్లూరి బ్రహ్మయ్యతోపాటు మరో పదిమంది డైరెక్టర్లు బ్యాంకు కార్యాలయానికి చేరుకున్నారు. విశ్రాంతి భవనంలో కూర్చువాలనే ఉద్దేశంతో అక్కడికి వెళ్లగా.. దానికి తాళం వేసి ఉంది. అయితే దాని మూడు తాళం చెవులూ చైర్మన్ వద్దనే ఉన్నాయనే విషయం తెలుసుకున్న డైరెక్టర్లు.. ఆగ్రహంతో విశ్రాంతి భవనం తలుపులు పగులగొట్టి లోనికి వెళ్లారు. కొద్దిసేపటికే అక్కడికి చేరుకున్న ప్రస్తుత చైర్మన్ దొండపాటి.. సభ్యుల తీరుపై మండిపడ్డారు. ఈ క్రమంలో అటు డైరెక్టర్లు, ఇటు చైర్మన్ మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. అక్కడే ఉన్న బ్యాంకు ఉన్నతాధికారులు, అధికారులు ఈ పరిస్థితిని గమనించి మెల్లగా తమ తమ చాంబర్లకు వెళ్లిపోయారు. తరువాత కొద్దిసేపటిలోనే బోర్డ్ రూములో పాలకవర్గ సమావేశాన్ని చైర్మన్ ప్రారంభించారు. విషయం తెలుసుకున్న డైరెక్టర్లు తిరిగి అక్కడికి చేరుకొని తాము హాజరైనట్లు సంతకాలు చేశారు. కా.. తమ డిమాండ్లు అజెండాలో లేకపోవడంతో సమావేశాన్ని బహిష్కరిస్తున్నట్లు ప్రకటించారు. ఇన్‌చార్జి చైర్మన్ ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని డైరక్టర్ జనగం కోటేశ్వరరావు మీడియాకు వివరించారు. మెజార్టీ సభ్యుల వాదన వినిపించుకోవడం లేదని ఆరోపించారు. తమ డిమాండ్లను అజెండాలో పెట్టేవరకు సమావేశంలో పాల్గొనబోమని స్పష్టం చేశారు.

సమస్యను మంత్రుల దృష్టికి తీసుకెళ్తా..

ఖాళీగా ఉన్న చైర్మన్ స్థానానికి, డైరెక్టర్ల స్థానాలకు ఎన్నిక నిర్వహించే విషయాన్ని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డిల దృష్టికి తీసుకెళ్తా. వారి సూచన మేరకు తప్పకుండా వచ్చే సమావేశంలో అవసరమైన విషయాలను అజెండాలో పెడతాం. పాలకవర్గంలోని కొందరు సభ్యులు కొద్ది రోజులుగా ఉద్దేశపూర్వకంగా రచ్చ చేసున్నట్లు కన్పిస్తోంది. వారి అభిప్రాయాన్ని గౌరవించి మూడు నెలల క్రితమే నూతన డైరెక్టర్ల ఎన్నిక అంశాన్ని అజెండాలో పెట్టాం. అయితే వారు పేర్లు చెప్పలేక చైర్మన్ ఎన్నికను తెరపైకి తీసుకొచ్చారు. ఈరోజు కూడా నాలుగు అంశాలను నా దృష్టికి తీసుకొచ్చారు. వచ్చే సమావేశంలో వాటిని అజెండాలో పెడతామని సభ్యులకు తెలియజేశాం.

–దొండపాటి వెంకటేశ్వరరావు, డీసీసీబీ ఇన్‌చార్జి చైర్మన్

వానొచ్చింది..

పలు మండలాల్లో మోస్తరు నుంచి భారీ వర్షం

అపరాలు, వాణిజ్య పంటల సాగుకు అనుకూలం

40 వేల ఎకరాలకు చేరిన వానకాలం సాగు

మధిరలో కురుస్తున్న భారీ వర్షం

ఖమ్మం వ్యవసాయం, జూన్ 13 : జిల్లాలోని పలు మండలాల్లో నైరుతి రుతుపవనాల ప్రభావంతో గురువారం సాయంత్రం ఈదురు గాలులు, ఉరుములు మెరుపులతో మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. ఉదయం నుంచి ఎండతోపాటు ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరి అయిన ప్రజలు సాయంత్రం కురిసిన వర్షంతో ఉపశమనం పొందారు. గ్రామీణ ప్రాంతాల్లో ఇప్పటికే దుక్కులు దున్నుకొని విత్తనాలు నాటడానికి సిద్ధంగా ఉన్న రైతులకు వర్షం ఊరట నిచ్చింది. ఖమ్మం నగరానికి వివిధ పనుల నిమిత్తం వచ్చిన ప్రజలు వర్షంతో ఇబ్బంది పడ్డారు. జిల్లాలోని కొణిజర్ల మండలంలో రికార్డు స్థాయిలో 68.8 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. బోనకల్ 53.3 మి.మీ, మధిర 52.8 మి.మీ, ఖమ్మం అర్బన్ 51.5 మి.మీ, చింతకాని 50 మి.మీ, రఘునాథపాలెం 46.8 మి.మీ, ఖమ్మం రూరల్ మండలంలో 26 మిల్లీమీటర్ల చొప్పున వర్షపాతం నమోదైంది. ఇప్పటివరకు అడపా దడపా కురిసిన వర్షాలతో జిల్లావ్యాప్తంగా 39,707 ఎకరాల్లో రైతులు విత్తనాలు నాటారు. వానకాలం సాగు లక్ష్యం 5.96 లక్షల ఎకరాలు కాగా.. ఇందులో ఇప్పటికే 788 ఎకరాల్లో రైతులు వరి నార్లు పోసుకున్నారు. రికార్డు స్థాయిలో ఇప్పటివరకు పత్తి సాగు 30,825 ఎకరాలకు చేరిందని వ్యవసాయ శాఖ అధికారులు పేర్కొన్నారు. పెసర సాగు 728 ఎకరాలు కాగా.. పచ్చిరొట్టను మరో 8 వేల ఎకరాల్లో సాగు చేశారు.

24 గంటలు వైద్య సేవలు అందించాలి

ఐటీడీఏ పీవో ప్రతీక్ జైన్

భద్రాచలం, జూన్ 13 : వర్షాకాలం దృష్ట్యా మారుమూల ఆదివాసీ గిరిజన ప్రాంత ప్రజలకు 24 గంటలపాటు వైద్య సేవలు అందించాలని ఐటీడీఏ పీవో ప్రతీక్ జైన్ వైద్యాధికారులను ఆదేశించారు. గురువారం భద్రాచలంలోని పీవో సమావేశ మందిరంలో ఆయన మాట్లాడుతూ వైద్యాధికారులు తాము పనిచేసే ప్రాంతంలోనే స్థానికంగా నివాసం ఉండాలని, వైద్య సిబ్బంది కూడా అందుబాటులో ఉంటూ.. సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ సమయపాలన పాటించాలన్నారు. మారుతున్న వాతావరణ పరిస్థితుల దృష్ట్యా గిరిజనులు జ్వరాలు, వాంతులు, విరేచనాల బారిన పడినట్లైతే వెంటనే వారి రక్త నమూనాలు సేకరించాలని, మలేరియా సోకినట్లైతే నయమయ్యే వరకు చికిత్స అందించాలని సూచించారు. మిగతా వ్యాధుల కోసం టీ హబ్‌కి రక్త నమూనాలు పంపించి.. రిపోర్టులు వచ్చిన తర్వాత బాధితులకు పూర్తి చికిత్స అందించాలన్నారు. హెడ్ క్వార్టర్స్‌లో పనిచేస్తున్న వైద్య సిబ్బంది లైన్ డిపార్ట్‌మెంట్‌తో సమన్వయ సమావేశం ఏర్పాటు చేసి.. ఆదివాసీ గిరిజనుల ఆరోగ్య స్థితిగతులపై తగిన జాగ్రత్తలు తీసుకోవాలని

అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు

డీఏవో విజయనిర్మల

కూసుమంచిలో ఎరువుల స్టాక్‌ను తనిఖీ చేస్తున్న డీఏవో విజయనిర్మల

కూసుమంచి, జూన్ 13 : కొన్నిచోట్ల అధిక ధరలకు విత్తనాలు విక్రయిస్తున్నట్లు మా దృష్టికి వచ్చిందని, అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని, వారి లైసెన్స్‌లు రద్దు చేస్తామని జిల్లా వ్యవసాయాధికారి(డీఏవో) విజయనిర్మల హెచ్చరించారు. కూసుమంచి, నాయకన్‌గూడెంలోని పలు విత్తన, ఎరువుల దుకాణాలను గురువారం ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా సాగుకు సరిపడా విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉన్నాయని, ఈ విషయంలో రైతులు ఎలాంటి ఆందోళన చెందొద్దన్నారు. అయితే కొందరు వ్యాపారులు కావాలనే కొన్ని కంపెనీలను రైతులకు అంటగట్టేందుకు ఒత్తిడి చేస్తున్నట్లు తెలుస్తోందని, అలాంటి వారిని సహించేది లేదన్నారు. రైతులకు అమ్మిన విత్తనాలకు సంబంధించి సరైన లాట్ నెంబర్లు ఉండాలని, నిత్యం దుకాణాల్లో స్టార్ రిజిస్టర్లు నిర్వహించాలని సూచించారు. ఎక్కడ తేడా వచ్చినా.. రోజువారీ రిజిస్టర్లు తప్పుగా రాసినా అటువంటి వ్యాపారులపై చర్యలు తప్పవన్నారు. ఎరువులు, విత్తన దుకాణాలను అధికారులు నిత్యం పర్యవేక్షిస్తారని, వారికి ఏమాత్రం అనుమానం వచ్చినా చర్యలు తీసుకుంటారన్నారు. అనంతరం దుకాణాల్లో స్టాక్ రిజిస్టర్లు, బోర్డులను పరిశీలించి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఏడీఏ విజయ్ చంద్ర, ఏవో వాణి అదితరులు పాల్గొన్నారు.

'ఓపెన్' ఫలితాలు విడుదల

ఖమ్మం ఎడ్యుకేషన్, జూన్ 13 : తెలంగాణ రాష్ట్ర ఓపెన్ స్కూల్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఓపెన్ టెన్త్, ఇంటర్ రెగ్యులర్ పరీక్షలకు సంబంధించిన ఫలితాలు గురువారం విడుదలయ్యాయి. జిల్లాలో ఓపెన్ టెన్త్‌లో 863 మంది అభ్యర్థులు హాజరుకాగా.. 349 మంది ఉత్తీర్ణత సాధించి.. 40.44 శాతం నమోదు చేశారు. ఓపెన్ ఇంటర్‌లో 1,031 మందికి.. 462 మంది ఉత్తీర్ణత సాధించి.. 44.81 శాతం పాస్ అయ్యారు. పరీక్ష ఫలితాలను తెలంగాణ ఓపెన్ స్కూల్ వెబ్‌సైట్‌లో పొందుపరిచినట్లు డీఈవో సోమశేఖర శర్మ తెలిపారు. రీ కౌంటింగ్, రీ వెరిఫికేషన్‌కు ఈ నెల 18వ తేదీ నుంచి 27వ తేదీ వరకు మీ సేవ కేంద్రాల్లో దరఖాస్తు చేసుకోవాలని రెండు జిల్లాల కోఆర్డినేటర్ మద్దినేని పాపారావు పేర్కొన్నారు. రీ కౌంటింగ్‌కు ఇంటర్‌లో ఒక సబ్జెక్ట్‌కు రూ.400, రీ వెరిఫికేషన్‌కు రూ.1,200, పదో తరగతిలో రీ కౌంటింగ్‌కు రూ.350, రీ వెరిఫికేషన్‌కు రూ.1,200 చొప్పున చెల్లించాలని పేర్కొన్నారు.

రెండోరోజూ నామమాత్రమే..!

- స్కూళ్లకు 58 శాతం విద్యార్థులు హాజరు
- ఎమ్మార్సీలకు చేరిన తెలుగు పుస్తకాలు

ఖమ్మం ఎడ్యుకేషన్, జూన్ 13 : వేసవి సెలవుల అనంతరం ప్రభుత్వ పాఠశాలలు బుధవారం పునఃప్రారంభం కాగా.. రెండో రోజైన గురువారం విద్యార్థుల హాజరు శాతం నామమాత్రంగానే ఉంది. జిల్లాలోని ప్రభుత్వ, లోకల్‌బాడీ, కేజీబీవీల్లో 1 నుంచి 10వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులు 62,066 మంది ఉండగా.. 35,805 మంది హాజరై 58 శాతం నమోదు చేశారు. అత్యధికంగా చింతకాని మండలంలో 69 శాతం హాజరు ఉండగా.. అత్యల్పంగా వైరాలో 48 శాతం, సింగరేణిలో 49 శాతం విద్యార్థుల హాజరును నమోదు చేశారు. గురువారం నిర్వహించిన బడిబాట కార్యక్రమంలో 2,171 మంది విద్యార్థులకు ప్రవేశాలు కల్పించారు. వీరిలో అంగన్‌వాడీ కేంద్రాల నుంచి 801 మంది, ప్రాథమిక పాఠశాలల నుంచి ఉన్నత పాఠశాలలకు 1,074 మంది, ప్రైవేట్ స్కూళ్ల నుంచి 287 మంది, బడి బయట పిల్లలు 9 మంది ఉన్నారు.

ఎమ్మార్సీలకు చేరిన తెలుగు పుస్తకాలు

ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఉచితంగా అందించే పాఠ్యపుస్తకాల్లో భాగంగా 1 నుంచి 10వ తరగతి వరకు అందించిన తెలుగు పాఠ్యపుస్తకంలోని ముందుమాటలో తప్పుగా ముద్రితమైన అంశాలను పరిగణనలోకి తీసుకుని బుధవారం విద్యార్థులకు అందజేసిన పుస్తకాలను గురువారం ఉపాధ్యాయులు సేకరించారు. అన్ని పాఠశాలల నుంచి సేకరించిన పుస్తకాలను ఆయా మండలాల్లోని ఎమ్మార్సీ(మండల రిసోర్స్ సెంటర్)లకు తరలించారు.

జలకళ.. వెలవెల

నాడు నీటితో కళకళలాడిన కలకోట చెరువు

నేడు నీళ్లు లేక వెలవెలబోతున్న కలకోట చెరువు

వరుణుడి కటాక్షం కోసం 'కలకోట' ఎదురుచూపు

సమృద్ధిగా వర్షం కురిస్తేనే చెరువులోకి నీరు చేరేది..

వానలు కురవాలని కోరుకుంటున్న ఆయకట్టు రైతాంగం

బోనకల్లు, జూన్ 13 : ఇది ఖమ్మం జిల్లా బోనకల్లు మండలంలోని కలకోట చెరువు. గత కేసీఆర్ ప్రభుత్వ హయాంలో నిత్యం నీటితో కళకళలాడింది. ఆయకట్టు రైతులకు రెండు పంటలకు నీరందించింది. ఏ లోటూ లేకుండా పదేళ్లు పుష్కలంగా రెండు పంటలు పండించుకున్న రైతులు.. ఇప్పుడు ఆ చెరువు మడుగును తలపిస్తుండడంతో చూసి చలించిపోతున్నారు. మండలంలో ఇదొక్కటే కాదు.. ఇలాంటి చెరువులెన్నో నీళ్ల కోసం నోళ్లు తెరిచాయి. గత ఏడాది నుంచి సమృద్ధిగా వర్షాలు కురవకపోవడం.. కాంగ్రెస్ ప్రభుత్వం సాగర్ జలాలను కాల్వల ద్వారా తరలించి చెరువులు నింపకపోవడంతో మండలంలోని చెరువులన్నీ ఎడారులను తలపిస్తున్నాయి. ఈ ఏడాది జూన్ నెల సగానికి వచ్చినా పూర్తిస్థాయిలో వర్షాలు కురవకపోవడంతో చెరువులన్నీ వెలవెలబోతున్నాయి. పశువులు తాగేందుకు కూడా నీళ్లు లేని పరిస్థితి దాపురించింది. మండలంలోని కలకోట, నారాయణపురం, రావినూతల, పెద్దబీరవల్లి, మోటమర్రి, ముష్టికుంట్ల, చిరునోముల, చొప్పకట్లపాలెం గ్రామాల రైతులు ప్రధానంగా చెరువులపై ఆధారపడి వేలాది ఎకరాల్లో వరి పంటలు సాగు చేసుకుంటారు. భారీ వర్షాలు కురిస్తేనే చెరువులన్నీ నిండి రైతుల ఆయకట్టుకు నీరందేది. వరుణ దేవుడు కనికరించి పూర్తి స్థాయిలో వర్షాలు కురిపించాలని.. సాగుకు నీటి లోటు రాకుండా చూడాలని ఆయకట్టు రైతులు వేడుకుంటున్నారు.